కథ

# మానసభ్రమణం

-నెట్టూరి లక్ష్మణరావు

ఒకటవ తేది.
సమయం మధ్యాహ్నం రెండు గంటల పదిహేను నిమిషాలు కావొస్తోంది.

''రాధా! సాయంత్రం ఆరు గంటలకల్లా పిల్లలతో రెడీగా ఉండవోయ్! ఫస్ట్ షోకు వెళదాం. సంధ్య థియేటర్‌లో నా ఫేవరేట్ హీరో పిక్చర్ రిలీజయింది. మా ఆఫీసు అటెండర్ ద్వారా అడ్వాన్స్ బుకింగ్‌లో టికెట్స్ తెప్పిస్తాను'' అన్నాడు స్కూటర్‌ని స్టార్ట్ చేస్తూ ఆఫీసుకు బయలుదేరుతున్న ఆమె భర్త వెంకట రమణ.

''అలాగేనండీ!'' అందామె వాకిట్లో నిల్చుని చిర్నవ్వుతో భర్త స్కూటర్ వీధి మలుపు తిరిగే వరకూ అలాగే చూసి, లోపలికెళ్ళింది.

స్కూటర్‌పై వెళుతున్న వెంకట రమణ ఈరోజు చాలా ఉషారుగా ఉండడంతో దారంట చిన్నగా విజిల్‌సాంగ్స్ పాడుతున్నాడు. ఆఫీసు గేటు దగ్గరకు చేరుకోవడంతో అప్పటి వరకూ పాడుతున్న విజిల్‌సాంగ్‌ని కట్ చేశాడు.

స్కూటర్‌ని పార్కింగ్ స్టాండ్‌లో వుంచి లాక్ చేశాడు. ''నమస్తే సార్!'' అని వినిపించడంతో, అటువైపు చూసిన వెంకట రమణకు ఎదురుగా అటెండర్ గుర్నాధం కనిపించాడు.

''నమస్తే!'' అంటూ స్కూటర్ కీస్‌ని ప్యాంట్ బ్యాక్ పాకెట్‌లో వేసుకున్నాడు.

''గుర్నాధం నీవు ఏమీ అనుకోనంటేనాకో చిన్న పని చేసిపెడతావా?''

''భలే వారే సార్! మీకు నేనెప్పుడైనా కాదన్నానా!'' అన్నాడు గుర్నాధం తన గారపళ్ళనికిలిస్తూ.

''మరేం లేదు. సంధ్య థియేటర్‌కెళ్ళి అడ్వాన్స్ బుకింగ్‌లో ఫస్ట్ షోకి నాలుగు రిజర్వ్‌డ్ టికెట్స్ తెచ్చిపెట్టాలి.''

''అలాగే''నంటూ వెంకటరమణ దగ్గర వంద రూపాయల నోటుని తీసుకుని, సైకిల్‌స్టాండ్‌వైపు దారితీశాడు గుర్నాధం. అతను వెళుతుంటే ఓ పనైపోయింది అన్న లుక్స్‌తో చూశాడు వెంకట రమణ.

ఆ రోజు ఫస్ట్ తారీఖు కావడంచే సెలవు పెట్టిన సిబ్బంది లేని కారణంగా ఫుల్ అటెన్‌డెన్స్‌తో ఆఫీసంతా కళకళలాడుతూ మహా సందడిగా ఉంది. స్టాఫ్ అందరి ముఖాల్లో చిరునవ్వు తాండవించ సాగింది.

వెంకట రమణ తన కటింగ్స్‌పోనూ మిగిలిన ఏడు వేల ఐదు వందల రూపాయల జీతాన్ని తీసుకుని ప్యాంట్ జేబులో పెటుకున్నాడు. అక్విడెన్స్ ఫారమ్‌పై రెవిన్యూ స్టాంప్‌నంటించి, సంతకం చేసి ఇచ్చాడు. ఆరోజు ఆఫీసు కార్యక్రమమంతా ఏదో మొక్కుబడిగా సాగిందే తప్ప, ఒక్క పని పూర్తి చేయలేకపోయాడు వెంకట రమణ. దాదాపు అన్ని సెక్షన్స్‌లోనూ పని అలాగే ఉందనిపించిందతనికి స్టాఫందరి సంభాషణలను బట్టి.

ఇంతలో గోడ గడియారం ''ఠంగ్ ... ఠంగ్...''మని ఐదుసార్లు మ్రోగింది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న స్టాఫంతా ఒక్కసారిగా ''హమ్మయ్య'' అంటూ ఊపిరి పీల్చుకుని తమ సంభాషణలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. క్యారియర్స్ సర్దుకుని ఒక్కొక్కరు ఆఫీసు నుండి బయటపడసాగారు.

పద్మవ్యూహంలాంటి ట్రాఫిక్‌ని ఛేధించుకుని ఉస్సూరంటూ ఎలాగో ఇల్లు చేరాడు వెంకటరమణ.

''రెడీగా ఉన్నావా?'' అన్నాడు అతడు వాకిట్లోనే నిల్చుని వున్న భార్య అలంకరణను చూసి. అవునన్నట్టు తలూపింది రాధ చిర్నవ్వుతో చీరను మరోసారి సవరించుకుంటూ.

వెంకటరమణ డ్రస్‌ని విడిచి, టవల్‌ని నడుముకు చుట్టుకుని బాత్రూమ్‌లో దూరాడు. అయిదే అయిదు నిమిషాల్లో స్నానాన్ని ముగించి, ట్రిమ్‌గా తయారైనాడు.

స్కూటర్‌ని స్టార్ట్ చేసి భార్యా, ఇద్దరు పిల్లలతో కలిసి సినిమా థియేటర్‌కు చేరుకున్నాడు. అడ్వాన్స్ బుకింగ్ టికెట్స్ కావడంచే నేరుగా థియేటర్‌లోకెళ్ళి తమ నెంబర్ సీట్లలో ఆసీనులైనారు. ఇంటర్‌వెల్‌లో అందరూ కూల్‌డ్రింక్‌ను త్రాగారు...

సినిమా పూర్తయిన తర్వాత హోటల్‌కెళ్ళి భోజనం చేసి ఇంటికి దారితీశాడు వెంకటరమణ భార్యాపిల్లలతో.

మర్నాడుదయం.

''ఏమోయ్ రాధా! ఇదిగో మన ఫ్యామిలీ బడ్జెట్. జాగర్తగా ఖర్చుపెట్టాలి సుమా!'' అంటూ జేబులోని జీతాన్ని తీసిచ్చాడు వెంకట రమణ భార్యకు. డబ్బునందుకున్న ఆమె వాటిని కళ్ళకద్దుకున్నది.

''అలాగేలెండి మహానుభావా! నేనేమీ మీ కంటికి దుబారా చేసే మనిషిలాగా కనపడుతున్నానేమిటి?'' అందామె వాటిని బీరువాలో పెట్టి, డోర్‌ని మూసేసి లాక్‌చేస్తూ.

***

పదకొండవ తేది.

వెంకట రమణ ఆఫీసుకు బయలుదేరడానికి సిద్ధపడుతున్నాడు. రాధ క్యారియర్‌ని సర్ది అతని చేతికిచ్చి, బెడ్ రూమ్‌లోకి వెళ్ళింది. వెంకట రమణ ఆమెని అనుసరించాడు.

''ఏమండీ! ఇంటి అద్దె, పాలు, సరుకులు, కరెంటు బిల్లు, ఫోన్ బిల్లు, పిల్లల స్కూల్ ఫీజు, ఇన్‌స్టాల్‌మెంట్స్ అమౌంట్ వగైరా ..

వగైరా చెల్లింపులన్నీ జరిగిపోయాయి. ఇక నా దగ్గర వెయ్యి రూపాయలు మాత్రమే ఉన్నాయి'' అంది రాధ డబుల్‌కాట్ పైనున్న దుప్పటిని తీసి మడత వేస్తూ.


ఫ్యామిలీ ఖర్చుని ఎప్పటికప్పుడు భర్తకు తెలుపుతూ, అప్పటి వరకున్న మిగులు బడ్జెట్‌ని గుర్తు చేయడం రాధకు ఆనవాయితీ.

''సరేలేవోయ్. ఇప్పుడు నేనేమన్నా కాదన్నానా?'' అంటూ వెంకటరమణ చిర్నవ్వును నవ్వి స్కూటర్‌ని బయటకు తీసి స్టార్ట్ చేయబోయాడు.

ఇంతలో 'పోస్ట్' అన్న కేక విన బడ్డంతో గేటు దగ్గరకు వెళ్ళిన వెంకట రమణ రెండు ఎన్వలప్ కవర్లను అందించి వెళ్ళిపోయాడు పోస్ట్‌మెన్. ఎక్కడి నుంచి వచ్చాయని ఫ్రం అడ్రసుని చూడగా రెండింటి మీదా రాయ లేదు.

లోపలికెళ్ళి సోఫాలో కూర్చుని అందులో మొదటి కవర్‌ని చించి చదువసాగాడు వెంకట రమణ. ఇంతలో రాధ వచ్చి అతని ప్రక్కన కూర్చుంది.

''ఏమోయ్ రాధా వింటున్నావు కదూ?'' అన్న అతని ప్రశ్నకు అవునన్నట్టు తలూపింది రాధ.



''ప్రియమైన వెంకట రమణకు,

మీ తండ్రి ఆశీర్వదించి వ్రాయునది. నాకు ఈ మధ్య ఆరోగ్యం బాగుండడం లేదు. ఈ పల్లెటూరులో సరైన వైద్య సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాను. అందుచేత నీ దగ్గరికొచ్చి అక్కడ స్పెషలిస్ట్ చేత చూపించుకుని, మందులు తీసుకుని ఓ నెల రోజుల పాటు ఉండి విశ్రాంతి తీసుకుందామనుకుంటున్నాను. కావున రెండ్రోజుల్లో బయలుదేరి వస్తున్నాను.


ఇట్లు
మీ నాన్న
సారంగపాణి''

తర్వాత రెండో ఉత్తరాన్ని చించి చదువసాగాడు వెంకటరమణ. అది రాధకు వాళ్ళమ్మ కౌసల్యాదేవి వ్రాసింది.

''బంగారు తల్లి రాధకు,

మీ అమ్మ దీవించి వ్రాయునది. ఉభయ కుశలోపరి. ఇక్కడ మీ నాన్న గారి అలవాట్లలో ఎలాంటి మార్పు లేదు. ఆ ముదనష్టపు త్రాగుడుతో ఇల్లును గుల్ల చేస్తున్నాడు. రిటైర్ అయినప్పటి నుండి పనిలేక మరీ ఇంట్లోనే త్రాగుతున్నాడు. దాంతో వచ్చే ఆ పెన్షన్ ఏమాత్రం సరిపోక రోజు రోజుకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కాసాగాయి. ఆయనలో మార్పొస్తుందన్న ఆశ నాలో ఇక ఏ కోశానా లేదు. నాకిక్కడ మనశ్శాంతిగా లేదు. అందుకే అక్కడికొచ్చి, ఓ నెల రోజులపాటు నీ దగ్గర ఉందామనుకుంటున్నాను. కావున రెండు రోజుల్లో బయలుదేరి వస్తున్నాను.

ఇట్లు
మీ అమ్మ
కౌసల్యాదేవి''





ఆ రెండు ఉత్తరాలను చదివిన వెంకట రమణ, విన్న రాధ గట్టిగా నిట్టూర్చారు. కారణం అలాంటి ఉత్తరాలు అప్పుడప్పుడు రావడం, అవి వారి ఫ్యామిలీ బడ్జెట్‌ని తారుమారు చేసి లోబడ్జెట్ ఏర్పడడం అనుభవ సారమే!

వెంకట రమణ వాచీకేసి చూసుకుని హడావుడిగా స్కూటర్‌ని స్టార్ట్ చేసి ఆఫీసుకు బయలుదేరాడు.

***

నెలాఖరు.

వెంకటరమణ సోఫాలో కూర్చుని పేపర్ తిరగేస్తున్నాడు. రాధ కాఫీ కప్పును తెచ్చి అతనికందించింది. అతను సిప్ చేయసాగాడు.

''ఏవండీ! ఇంట్లో సరుకులన్నీ నిండుకున్నాయి. వెళ్ళి తీసుకు రాకూడదూ?'' అంది రాధ భర్త చేతికి బ్యాగ్‌నందిస్తూ. వెంకట రమణ ఆమె చెప్పిన సరుకులన్నీ ఖాతా పుస్తకంలో వ్రాసుకుని, పచారీ షాప్‌కెళ్ళబోయాడు.

''ఇదిగో అమ్మాయి రాధా! అలాగే నాకు నాలుగు టాయ్‌లెట్ సోప్స్, మంచి టాల్కమ్ పౌడర్‌ని తెప్పించు. నీకు తెలుసుగా మొదటి నుంచి నేను సపరేట్ సోప్‌ని వాడతానని'' అంది రాధ తల్లి కౌసల్యాదేవి గారాలుపోతూ.

వాటిని ఖాతా పుస్తకంలో రాయాలా వద్దాని సందిగ్ధంలో పడిపోయాడు వెంకట రమణ. రాధ మొహాన్ని చూసేసరికి, వాటిని రాయాలని నిర్ణయించుకున్నాడు.

వియ్యపురాలు అలా ఆర్డరేస్తుంటే తానేమీ తక్కువ తినలేదన్నట్టు చూశాడు వెంకటరమణ తండ్రి సారంగపాణి,

''ఒరే అబ్బాయి! అలాగే నాకూ కాస్త కాస్ట్‌లీ సిగార్స్ బండిల్ ఒకటి, నాసిరకం కాని నశ్యం డబ్బాలు నాలుగు తెప్పించు'' అన్నాడు సారంగపాణి చిద్విలాసంగా.

ఇక తప్పదన్నట్టు తండ్రి, అత్తగారు జారీ చేసిన వాటిని లిస్ట్‌లో చేర్చాడు వెంకట రమణ మనస్సులో గొణుక్కుంటూ.

రాధ అందించిన బ్యాగ్‌నందుకుని అలాగేనంటూ వెంకట రమణ బయటకెళ్ళిపోయాడు.

గంట తర్వాత సరుకులను తీసుకుని ఇంటికొచ్చాడు వెంకట రమణ ధీమాగా.

''ఏమండీ! చిన్నిదానికి ఎంత ప్రమాదం జరిగిందో తెలుసా? అల్మారా లోపల ఉన్న హెయిర్ ఆయిల్ సీసాను అజాగర్తగా తీస్తుండడంతో అది జారి క్రిందపడి పగిలిపోయింది. దాంతో కంగారు పడిన అది చూసుకోకుండా పగిలిన సీసాముక్కలపై కాలువేసే సరికి తెగి ఎంత రక్తం కారిందనుకున్నారు. ముందు నేను ఫస్ట్ ఎయిడ్ చేశాననుకో. వెంటనే మీరు దాన్ని ఆసుపత్రికి తీసుకెళ్ళి డాక్టర్ గారికి చూపించి బ్యాండేజీ చేయించుకు రండి'' సరుకులు తీసుకుని ఇంట్లోకొచ్చిన భర్తకు వాకిట్లోనే గుక్క తిప్పుకోకుండా ఏకరువు పెట్టింది రాధ కళ్ళొత్తుకుంటూ.

దాంతో వెంకట రమణ పాపను స్కూటర్‌పై కూర్చోబెట్టుకుని కంగారుగా హాస్పిటల్‌కు బయలుదేరాడు.

అరగంట తర్వాత ఇల్లు చేరాడు వెంకట రమణ ఉస్సూరంటూ పాపకు బ్యాండేజీ చేయించి. ఇంట్లో కొచ్చీ రాగానే మళ్ళీ క్లాస్ తీసుకుంది రాధ భర్తకు.

''ఏమండీ! మీ సుపుత్రుడు ఎంత ఘనకార్యం చేశాడో తెలుసా? ఇంట్లో క్రికెట్ బంతిని విసిరి టి.వి అద్దాన్ని భళ్ళున పగులగొట్టేశాడు. దాన్ని వెంటనే తీసుకెళ్ళి రిపేరు చేయించరూ! పైగా ఈ మధ్య టివిలో రోజుకు మూడు పూటలా సినిమాలాయె. చూడకుంటే మిస్సయిపోమూ'' అంది రాధ. అది విన్న వెంకట రమణకు మతిపోయినంత పనైంది.

''ఛీ! ఛీ!! ప్రమాదాలు, ఇబ్బందులు అన్ని కలిసికట్టుగా ఒకే సారి నెలాఖరులోనే రావాలా! వీటికొక సమయం, సందర్భం లేదూ?'' అసహనాన్ని ప్రదర్శించాడు వెంకట రమణ ఉండబట్టలేక. పైగా తన ఖాళీ జేబు వెక్కిరిస్తుండడంతో అతనికి మరీ చిర్రెత్తుకొచ్చింది.

పాపకు జరిగిన ప్రమాదానికి, బాబు చేసిన అల్లరి చేష్టకు ఖంగు తిన్న భర్త అనీజీగా ఉండడాన్ని గమనించింది రాధ.

''చూడండి! సాగరంలో ఆటుపోట్లు, సంసారంలో ఇబ్బందులు రావడం చాలా సహజం. మనకు ఇబ్బందులు వచ్చాయని సమయానికి డబ్బులేదని ఆ నెలాఖరుకు ఎలా తెలుస్తుందండీ? జరిగేవి జరగకుండా ఎవరికోసం ఆగవు'' అంది రాధ భర్తను అనునయిస్తూ.

భార్య మాటలను అవగాహన చేసుకున్న వెంకట రమణ మదిలో మాసభ్రమణం మెదిలింది. రేపు మొదటి తేదీ అని జ్ఞప్తి కొచ్చేసరికి అంతలోనే ఆనందం కలిగింది వెంకట రమణలో.

## షారుఖ్‌పై మీడియా కన్నెర్ర

'సిర్ బి దిల్ హై' చిత్రంలో తనకు అన్ని రకాలుగా ప్రోత్సాహం ఇచ్చిన మీడియాను విమర్శిస్తూ కొంచెం అతిగా తీసినందుకు ఈ రోజున షారుఖ్ తగిన ప్రతిఫలాన్ని అనుభవించబోతున్నాడు. మీడియా అంతా షారుఖ్‌ని దాదాపు బేన్ చేసే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయని ఒక బాలీవుడ్ పత్రిక తెలియజేసింది. ఇప్పటికే కొన్ని పత్రికలు అతడిని బహిష్కరించాయి కూడా. ఈ విషయమే కాకుండా ఈ మధ్య షారుఖ్ నటించిన శీతల పానియం యాడ్‌లో నటించాడు. ఆ యాడ్‌లో హృతిక్‌రోషన్ ని పోలిన బొమ్మను ఛీ అని చూడటం వంటివి చేసి ఇంకా అప్రతిష్టను తెచ్చుకున్నాడు. బాలీవుడ్‌లో సూపర్‌హిట్ చిత్రాల్లో నటించిన హీరోల్లో అతి త్వరగా చెడ్డపేరును తెచ్చుకుంటున్న వ్యక్తి ఒక్క షారుఖ్ అయి ఉంటాడు.

